క్లుప్తంగా

సంజీవకు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ టూరిజం మేనేజ్‌మెంట్ విభాగం పరిశోధకుడు బొల్లారం సంజీవకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఇంపాక్ట్ ఆఫ్ టూరిజం ఆన్ సోషియో – ఎకనామిక్ డెవలప్‌మెంట్ ఇన్ ఇండియా – ఏ స్టడీ ఆఫ్ నార్త్ తెలంగాణ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి సంజీవకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. ఆ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ దయాకర్ రావు పర్యవేక్షణలో సంజీవ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

బయో టెక్నాలజీలో సునీతాబాయికి..



హన్మకొండ: హనుమకొండ కొత్తూరు జెండాకు చెందిన దారావత్ సునీతాబాయికి కాకతీయ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఫైటో కెమికల్ స్క్రీనింగ్, ఫార్మా స్యూటికల్ స్టడీస్ అండ్ సింథసిస్ ఆఫ్ సిల్వర్ నానో పార్టికల్స్ ఫ్రమ్ నోథపోడైట్స్ ఫోటిడా అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి యూనివర్శిటీ పీహెచ్‌డీ ప్రదానం చేసింది. ప్రొఫెసర్ తాదూరి శాస్త్రి పర్యవేక్షణలో ఆమె తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

16కు మెట్టుగుట్టపై షాపుల వేలం వాయిదా

మడికొండ: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా తొమ్మిది రోజుల పాటు జరగనున్న నవరాత్సోవాలను పురస్కరించుకుని మెట్టుగుట్టపై నిర్వహించనున్న షాపుల వేలంపాటను 8వ తేదీ నుంచి 16వ తేదీకి వాయిదా వేసినట్లు కార్యనిర్వాహణాధికారి శేషుభారతి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం 8వ తేదీన సెలవు ప్రకటించడంతో వేలాన్ని వాయిదా వేసినట్లు పేర్కొన్నారు.

నేడు శోభారాణి యాది సభ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగం పార్ట్‌టైం అధ్యాపకురాలు, హక్కుల కార్యకర్త డాక్టర్ కందాల శోభారాణి మొదటి యాది సభను ఈనెల 8న ఉదయం కాకతీయ యూనివర్సిటీ రెండవ గేట్ ఎదురుగా విజయగణపతి కాలనీలో నిర్వహించనున్నారు. యాదిసభలో వక్తలుగా కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్, అరుణోదయ విమలక్క, రచయిత్రి అనిశెట్టి రజిత, కళావతి (విరసం), రమేష్‌చంద్ర (సీఎల్‌సీ), లింగారెడ్డి(డీటీఎఫ్), లక్ష్మీనర్సింహా (డీజేయూ), కేయూ జువాలజీ విభాగం ప్రొఫెసర్లు వెంకయ్య, ఈసం నారాయణ, రమ (సీఐటీయూ), అధ్యాపకుడు తిరుణహరి శేషుతోపాటు తదితరులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

11న పాటల పోటీలు



నయీంనగర్: అమర గాయకుడు ఘంటశాల 50 వర్ధంతి సందర్భంగా ఈనెల 11న హనుమకొండ వాగ్దేవి కళాశాల ఆడిటోరియంలో పాటల పోటీలు నిర్వహించనున్నట్లు కాకతీయ మ్యూజికల్ క్లబ్ నిర్వాహకులు తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పాల్గొనాలనుకునే వారు 99494 39268 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఆయుష్ ఆర్‌డీడీకి సన్మానం



హన్మకొండ: హనుమకొండ ఎక్సైజ్‌కాలనీలోని ఆయుష్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రవి నాయక్‌ను హోమియోపతి డాక్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు కలిశారు. ఈమేరకు రవి నాయక్‌కు అసోసియేషన్ నూతన అధ్యక్షుడు డాక్టర్ మోహన్‌లాల్, కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ విమల, కమిటీ సభ్యులు డాక్టర్ శ్రీవాణి, డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ శ్రీనివాస్ నాయక్ బుధవారం పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు.

8మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు

ఖిలా వరంగల్: ఓ వ్యక్తిని కులం పేరుతో దూషించిన 8మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కింద కేసు నమోదు చేసినట్లు మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ సురేష్‌గౌడ్ తెలిపారు. ఈనెల 3న రాత్రి కరీమాబాద్‌లోని ప్రతాప్‌నగర్ ఎస్సీ కాలనీకి చెందిన చెందిన మంద విష్ణు, మాతంగి జ్ఞానేశ్వర్, పసునూరి సన్నీపై అదే ప్రాంతానికి చెందిన మీర్జా అజ్జు, జుల్లా, మిర్జా ఇస్మాయిల్, అక్తర్, కోరే కుమారస్వామి, పెద్దూరి నాగరాజు, సాయి దాడి చేయగా, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

హన్మకొండ: హసన్‌పర్తిలో బుధవారం జరిగిన కార్యక్రమంలో బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ నూతన క్యాలెండర్, డైరీని యూనియన్ హసన్‌పర్తి మండల కార్యదర్శి పుల్ల అశోక్ ఆవిష్కరించారు.

ప్రజల జీవనోపాధిపై కేంద్రం దాడులు



వరంగల్: సమ్మె వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు



బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట..



సమ్మె నోటీసు అందజేస్తున్న సంఘం నాయకులు

వరంగల్: కార్మిక చట్టాలతో సంక్రమించిన హక్కులను కాలరాస్తూ ప్రజల జీవనోపాధిపై కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దాడులు చేస్తోందని ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎస్‌టీయూసీ నాయకులు గన్నారపు రమేష్, ముక్కెర రామస్వామి, పుల్ల రమేష్, గంగుల దయాకర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈనెల 16వ తేదీన దేశవ్యాప్తంగా చేపట్టనున్న కార్మికుల ధర్నా వాల్‌పోస్టర్లను ఏనుమాముల మార్కెట్‌లో ఏఐటీయూసీ యార్డు ప్రధాన కార్యదర్శి దామెర కృష్ణ ఆధ్వర్యంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ట్రేడ్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ సమ్మె విజయవంతం చేసేందుకు ఈనెల 8వ తేదీన ఎల్‌బీనగర్‌లోని డీసెంట్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్న సదస్సుకు కార్మిక వర్గాలు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు ఎం డి.యాకోబ్, కమలాకర్, రాజమల్లు, రాములు, శాంతి, సరోజన, పోచమ్మ, రాజేష్, దాసు పాల్గొన్నారు.

16న సమ్మెను విజయవంతం చేయాలి

వరంగల్ అర్బన్: దేశవ్యాప్తంగా ఈనెల 16న నిర్వహించనున్న ఆల్ ఇండియా సమ్మెలో కార్మికులు, రైతులు, ఉపాధి కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ మున్సిపల్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఉప్పలయ్య కోరారు. ఈమేరకు వరంగల్ బల్దియా ప్రధాన కార్యాలయం ఆవరణలో సమ్మె వాల్‌పోస్టర్లను బుధవారం విడుదల చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఉప్పలయ్య మాట్లాడుతూ కార్మిక, కర్షకుల సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఏల్పుల ధర్మ రాజు, ఐఎస్‌టీయూసీ వరంగల్ జిల్లా కార్యదర్శి పుల్లా రమేష్, హనుమకొండ జిల్లా మున్నంగి రఘు, బీఆర్‌టీయూ నాయకులు ఆదాం, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్షుడు బరుపట్ల మహేష్, నాయకులు నవనీత, యాస బాబు, మారపాక అనిల్, నరేష్, రాజారపు భాస్కర్, బొట్ల రమేష్, ఏక్ సుధాకర్, ఐఎన్టీయూసీ నాయకులు గజ్జల లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత

వరంగల్ చౌరస్తా / రామన్నపేట: బట్టల షాపుల్లో పనిచేస్తున్న గుమాస్తా కార్మికులకు ఒక్కొక్కరికి నెలకు రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి డిమాండ్ చేశారు. ఈనెల 16న దేశవ్యాప్తంగా జరగనున్న కార్మిక సమ్మెలో కార్మికులు, రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం, సమ్మె నోటీసును వరంగల్ బట్టల వర్తక సంఘం అధ్యక్షుడు గుండా నమఃశివాయకు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో బట్టల షాపు గుమాస్తాల సంఘం నాయకులు పెండెం కుమారస్వామి, రాజు, రాధిక, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ సమ్మెను జయప్రదం చేయండి

నయీంనగర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16న గ్రామీణ బంద్, సమ్మెను జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా – కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ పిలుపునిచ్చిందని తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర కన్వీనర్ వెంకటయ్య తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు, కార్మికులు సమ్మెలో పాల్గొని కేంద్ర ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని సూచించారు. కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని సూచించారు. ప్రజా సంక్షేమానికి కృషి చేయాలని అన్నారు. సమావేశంలో ఇంద్రసేనం, బాబు, గణేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కేయూలో అధికారుల బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న నర్సింహచారి



ప్రసాద్‌ను సన్మానిస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పలువురు అధికారులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కేయూ పరీక్షల నియంత్రణాధికారిగా కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంటు కళాశాల ప్రొఫెసర్ నర్సింహచారి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఆ బాధ్యతలను నిర్వర్తించిన ప్రొఫెసర్ మల్లారెడ్డి నుంచి నర్సింహచారి బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రసాద్..

కాకతీయ యూనివర్సిటీలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కాంట్రాక్టు ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఏటీబీటీ ప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తించిన భాస్కర్ నుంచి ప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు కేయూ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్, సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్‌డీ.ప్రసాద్, బాధ్యులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కేయూ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం బాధ్యులు దామెర భిక్షపతి, మధుకర్‌రావు, చీకటి శ్రీనివాస్, జెత్యా, భాస్కర్, కుమార్, రవీందర్, కిరణ్ పాల్గొన్నారు.



సదానందాన్ని అభినందిస్తున్న ఉద్యోగులు

కేయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సదానందం..

కాకతీయ యూనివర్సిటీలోని కో ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ సదానందం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సదానందం.. ఇప్పటివరకు బాధ్యతలు నిర్వర్తించిన ప్రొఫెసర్ మల్లారెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరించారు.

ప్రతిపాదనలు సిద్ధం చేయండి



వరంగల్ అర్బన్: అమృత్ 2.3 పథకం కోసం ప్రతిపాదనలు యుద్ధ ప్రతిపాదికన తయారు చేసి నివేదించాలని గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి ఇంజనీర్లను ఆదేశించారు. బుధవారం బల్దియా కార్యాలయంలో తాగునీటి సరఫరా, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. నగరాల్లో నీటి ఎద్దడిని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.3 పథకంలో రూపొందించిందన్నారు. అందులో భాగంగా తొలి దశ (ఫేజ్–1) కింద నిధులు అందజేసిన నేపథ్యంలో అమృత్ 2.3 కోసం పబ్లిక్ హెల్త్, బల్దియా అధికారులు సమన్వయంతో సమగ్ర నీటి సరఫరాకు తగిన ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. ముఖ్యంగా నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలను దృష్టిలో ఉంచుకొని ప్రణాళికలు ఉండాలన్నారు. వేసవి కాలం దృష్ట్యా నగరంలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని మేయర్ అన్నారు. సమావేశంలో బల్దియా ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర ఈఈలు బీఎల్ శ్రీనివాస రావు, రాజయ్య, శ్రీనివాస్, పబ్లిక్ హెల్త్ ఈఈ రాజ్‌కుమార్, డీఈలు సంతోష్ బాబు, రవికుమార్, సారంగం, రవికిరణ్ పాల్గొన్నారు.

ఫంక్షన్ హాల్ సీజ్



వరంగల్ అర్బన్: ఆస్తి, నీటి పన్నులు చెల్లించకుండా బకాయిలు పడిన యాజమాన్యాలపై బల్దియా పన్నుల విభాగాధికారులు, సిబ్బంది సీరియస్‌గా వ్యవహరిస్తున్నారు. కాజీపేట సర్కిల్ పరిధిలోని మడికొండలో కొన్నేళ్లుగా బాలాజీ ఫంక్షన్ హాల్ నిర్వహిస్తూ రెండేళ్ల నుంచి ఆస్తి పన్ను చెల్లించకపోవడంతో డిప్యూటీ కమిషనర్ రవీందర్ నేతృత్వంలో కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం ఫంక్షన్ హాల్‌ను సీజ్ చేశారు. యాజమాన్యానికి రెడ్ నోటీసు జారీ చేశామని అయినప్పటికీ ఆయన పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు సుదర్శన్, యూసుఫొద్దీన్, సూపరింటెండెంట్ జారతి అనిల్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు దేవ రాజ్, రజిని, నవనీత్ తదితరులు పాల్గొన్నారు.

క్షేత్ర పర్యటనతో విద్యార్థులకు అవగాహన



వ్యవసాయ పరిశోధన స్థానం వద్ద విద్యార్థులు

వరంగల్ : క్షేత్రస్థాయి పర్యటనతో విద్యార్థులకు అవగాహన కలుగుతుందని ఆరెపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చలమల్ల నాగేశ్వరరావు అన్నారు. ఒకరోజు క్షేత్ర పర్యటనలో భాగంగా విద్యార్థులు బుధవారం ఆరెపల్లిలోని వ్యవసాయ పరిశోధన స్థానాన్ని సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థులకు ఒకరోజు కురిసే వర్షాన్ని ఏ విధంగా లెక్కిస్తారు, ఉష్ణోగ్రతలను ఏ విధంగా నమోదు చేస్తారో వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త ఎల్.శకుంతల వివరించారు. గాలి వ్యాపించే దిశ, గాలి వేగం, గాలిలో తేమ శాతం ఏ విధంగా కనుక్కుంటారో అవగాహన కల్పించారు. ఐదో తరగతి పాఠ్యాంశంలోని వర్మీ కంపోస్ట్ పిట్ నిర్మాణం, తయారీ విధానం, వర్మీ కంపోస్ట్ (సేంద్రియ ఎరువు) పంటలకు వేస్తే అధిక దిగుబడి వస్తుందని అర్థవంతంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరెపల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు వెంకన్న, ఉపాధ్యాయులు విజయ, రాజిరెడ్డి, మున్నీ, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు వాటర్‌ప్లాంట్ బహూకరణ

కరీమాబాద్: కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు విద్యార్థుల సౌకర్యార్థం 300 లీటర్ల సామర్థ్యం గల ఆర్ఓ వాటర్‌ప్లాంట్‌ను విర్బాక్ అనిమల్ హెల్త్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ బహూకరించింది. ఈ సందర్భంగా ప్లాంట్‌ను కంపెనీ రీజినల్ బిజినెస్ మేనేజర్ ఎండీ.సిరాజుద్దీన్ బుధవారం ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు సురక్షితమైన తాగునీటిని అందించడం ఆనందంగా ఉందని చెప్పారు. సామాజిక బాధ్యతతో వాటర్‌ప్లాంట్‌ను బహూకరించినట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఆర్.మాధవి, కంపెనీ ప్రతినిధులు మహేష్, రమేష్, రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సిరాజుద్దీన్

బ్రెయిన్ ట్యూమర్ బాధిత చిన్నారికి చేయూత

కాజీపేట రూరల్: కాజీపేట బోడగుట్టలోని ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థి, బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న లాదెళ్ల అభిరామ్ వైద్య చికిత్స కోసం దాతలు ఆర్థిక చేయూనందించారు. ఈమేరకు రూ.39 వేలు ఆర్థిక సాయం బుధవారం అందజేశారు. అభిరాం హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్యఖర్చులు రూ.5 లక్షలు అవుతాయని వైద్యులు తెలిపినట్లు స్థానిక నాయకుడు ఎండీ.అఫ్జల్ తెలిపారు. కాగా, మంగళవారం బోడగుట్ట స్కూల్ తరఫున రూ.లక్షకు పైగా ఆర్థిక సాయం చేశారు. బుధవారం దాతలు రూ.39 వేలను అందించారు.

యువత సన్మార్గంలో పయనించాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీస్ కళా బృందం కళాకారులు

ఖిలా వరంగల్: యువత మద్యానికి బానిస కాకుండా సన్మార్గంలో పయనించాలని ఇన్‌స్పెక్టర్ సురేష్‌గౌడ్ సూచించారు. ఈమేరకు వరంగల్ తూర్పు కోట పోచమ్మ టెంపుల్ బొడ్రాయి వద్ద మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ ఎస్సై, పోలీస్ కళాకారుల ఆధ్వర్యంలో సామాజిక అంశాలపై చైతన్య కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. చిన్నతనంలో గంజాయి, మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను విచ్ఛిన్నం చేసుకోవద్దని సూచించారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించి ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్, మెసేజ్‌లు, లింక్‌లకు స్పందించవద్దని హెచ్చరించారు. ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే 100 నంబర్‌కు కాల్ చేయాలని, సైబర్ నేరాలకు గురైతే తక్షణమే 1930 టోల్ ఫ్రీనంబర్‌కు కాల్ చేయాలని చెప్పారు. అనంతరం పోలీసుల కళా జాగృతి బృందం కళాకారులు పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మిల్స్‌కాలనీ ఎస్సై పూర్ణచందర్, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

జాతరకు రావాలని సీపీకి ఆహ్వానం



వరంగల్ క్రైం: ఈనెల 21నుంచి 24వ వరకు ఆత్మకూరు మండలం అగ్రంపహాడ్‌లో నిర్వహించనున్న సమ్మక్క, సారలమ్మ జాతరకు రావాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝాను పూజారులు కోరారు. ఈమేరకు బుధవారం ఆహ్వాన పత్రికను అందించారు. జాతరలో ఏర్పాటు చేస్తున్న బందోబస్తు, ఏర్పాట్లపై పోలీస్ అధికారులు, ఆలయ అధికారులను సీపీ అడిగి తెలుసుకున్నారు. సీపీని కలిసిన వారిలో ఆత్మకూరు ఇన్‌స్పెక్టర్ రవిరాజ్, ఆలయ అధికారి శేషగిరి, పూజారులు సాంబశివరావు, వెంకన్న, సారంగపాణి, భాస్కర్, విశ్వనాథ్, నాయకులు రమేష్, స్వామి పాల్గొన్నారు.

ఇళ్ల యజమాని పేరుపై నంబర్లు కేటాయించాలి



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, ప్రజలు

వరంగల్ అర్బన్: ఇళ్లకు ఓల్డర్ నంబర్లు కాకుండా యజమాని పేరిట ఇంటి నంబర్లు కేటాయించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట పార్టీ రామన్నపేట జోన్ కమిటీ ఆధ్వర్యంలో బాధితులతో కలిసి బుధవారం ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు సింగారపు ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో జిల్లా కార్యదర్శి సీహెచ్.రంగయ్య మాట్లాడుతూ జీఓ నంబరు 151 ప్రకారం ఓల్డర్ నంబర్లను గత రాష్ట్ర ప్రభుత్వం జారీ చేశారని అన్నారు. ఇంటి యజమాని పేరు లేకపోవడంతో పేదలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటి పభుత్వం పేదల ఇళ్లకు ఓల్డర్ నంబర్లు కాకుండా ఇంటి యజమాని పేరిట నంబర్లు కేటాయించాలని సూచించారు. అనంతరం, బల్దియా అడిషనల్ కమిషనర్ అనిసుర్ రషీద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అరూరి కుమార్, రంగరాజు విజయ, కొల్లోజు రమేష్, సంగీత, వీరస్వామి, శివ, శ్రీను, రాజు, చంద్రమౌళి, రవి, ఆదాం పాల్గొన్నారు.

రహదారి.. నాగరికతకు చిహ్నం



అవగాహన కల్పిస్తున్న విజయపాల్‌రెడ్డి

దేశాయిపేట: రహదారి నాగరికతకు చిహ్నం.. ప్రయాణం ప్రగతికి సంకేతం అని సాంకేతిక యుగ వారసులైన తమకు ప్రయాణం తప్పనిసరి అని రక్షణ రోడ్ సేఫ్టీ ఫౌండేషన్ డైరెక్టర్ విజయపాల్‌రెడ్డి అన్నారు. ఈక్రమంలో ప్రతీఒక్కరు ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు. దేశాయిపేటలోని సీకేఎం కళాశాలలో ఎన్‌సీసీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఏకాగ్రతతో వాహనాలు నడపాలని చెప్పారు. రిసోర్స్ పర్సన్ నీలం సంపత్ మాట్లాడుతూ రోడ్లపై అడ్డదిడ్డంగా వాహనాలు నడిపితే ప్రమాదాలు సంభవిస్తాయని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశిధర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ధర్మారెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు ధర్మయ్య, గంగయ్య, ఉదయ, అనిల్, మోహన్, కుమార్, సుమలత, కెప్టెన్ సతీష్, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్క సుమన్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నిరసన



హెడ్ పోస్టాఫీస్ సెంటర్‌లో దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న నాయకులు



భట్టుపల్లి చౌరస్తాలో..

వరంగల్ చౌరస్తా: సీఎం రేవంత్‌రెడ్డిని దుర్భాషలాడిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ వ్యాఖ్యలను నిరసిస్తూ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మలను కాంగ్రెస్ నాయకులు బుధవారం ఊరేగించి దహనం చేశారు. ఈ సందర్భంగా వరంగల్ హెడ్ పోస్టాఫీస్ సెంటర్‌లో కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకుడు గౌడు నాగరాజ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్ మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు అధికారం పోయి ఆగమాగం అవుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు ఉట్ల ప్రవీణ్, పోలెపాక విశాల్ బాబు, ఎస్‌కే.టైమర్, కట్కూరి అన్వేష్, సర్దార్ జస్వీర్ సింగ్, గూడ నవీన్, దొడు నాగరాజ్, రామగిరి శ్రీవిద్య, పాడిశెట్టి సరళ దేవి, దామెరకొండ విజయలక్ష్మి, కొండపర్తి శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

బాల్క సుమన్ చిత్రపటానికి చెప్పుల దండ

కాజీపేట అర్బన్: సీఎం రేవంత్‌రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యాలను ఖండిస్తూ బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చిత్రపటానికి చెప్పుల దండ వేసి కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు. 44వ డివిజన్ పరిధిలోని భట్టుపల్లి, కొత్తపల్లి గ్రామాల పార్టీ నాయకులు భట్టుపల్లి చౌరస్తాలో బుధవారం ధర్నా చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి బాల్క సుమన్ భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజారపు స్వామి, భట్టుపల్లి, కొత్తపల్లి నాయకులు పాల్గొన్నారు.

సుమన్ దిష్టిబొమ్మ దహనం

ఖిలా వరంగల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను బీఆర్ఎస్ నాయకుడు బాల్క సుమన్ వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈమేరకు సుమన్ దిష్టిబొమ్మను వరంగల్ తూర్పు కోట పరిధిలోని చింతల్ ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద కాంగ్రెస్ పార్టీ 37వ డివిజన్ ఎస్సీ సెల్ విభాగం మండల అధ్యక్షుడు కలకుట్ల కుమార్, మాదాసి మధుకర్, అశోక్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం దహనం చేశారు. రేవంత్‌రెడ్డికి బాల్క సుమన్ బహిరంగ క్షమాపణ చెప్పాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీరన్న, బోయిన దూడయ్య, సంగర బోయిన చందర్ పాల్గొన్నారు.

గోదామాధవ కేంద్రంలో కలశస్థాపన



మాట్లాడుతున్న రాధాకృష్ణ

హన్మకొండ కల్చరల్: వరంగల్ జిల్లా వికాస తరంగిణి ఆధ్వర్యంలో త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి పర్యవేక్షణలో సమతాకుంభ్‌లో భాగంగా నిర్వహిస్తున్న సమతావాక్షి కార్యక్రమాన్ని హనుమకొండలోని వికాస్‌నగర్‌లోని గోదామాధవ ఆధ్యాత్మిక ప్రచార కేంద్రంలో బుధవారం నిర్వహించారు. కేంద్రం నిర్వాహకులు ఆరుట్ల శ్రీనివాసాచార్యస్వామి ఆధ్వర్యంలో ఆపదుద్ధారక స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి కేంద్రంలో కలశస్థాపన చేశారు. సమతా దీక్షలో భాగంగా భక్తులు నగర సంకీర్తనను సాయంత్రం నిర్వహించి బియ్యపు గింజలను సేకరించి కలశంలో వేశారు. సమతాదీక్ష విశిష్టతను వికాస తరంగణి బాధ్యుడు బచ్చు రాధాకృష్ణ వివరించారు. అనంతరం భక్తులకు ప్రసాదాల వితరణ చేశారు. కార్యక్రమంలో చిర్రా ఆదిరెడ్డి, ఉమ దంపతులు, వెన్నపురెడ్డి రమణారెడ్డి, సరళ దంపతులు, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

సేవాలాల్ జయంతిని సెలవుగా ప్రకటించాలి



హన్మకొండ అర్బన్: ఈనెల 15న నిర్వహించే సేవాలాల్ మహరాజ్ జయంతి రోజును ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని గిరిజన సంఘాల నాయకులు కోరారు. ఈమేరకు కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను గిరిజన సంఘాల నాయకులు బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. నగరంలోని గిరిజన భవన్‌లో జరగనున్న సేవాలాల్ జయంతి ఉత్సవాలకు హాజరుకావాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో లంబాడీ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు పోరిక ఈశ్వర్‌సింగ్ నాయక్, సేవాలాల్ మహారాజ్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బానోతు నవీన్ నాయక్, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వర్‌సింగ్‌నాయక్ పాల్గొన్నారు.

రమాబాయికి నివాళి

ఖిలా వరంగల్: డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ సతీమణి రమాబాయి 126వ జయంతి వేడుకలను వరంగల్ అండర్ బ్రిడ్జి రోడ్డుపై ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదాసి రాజు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమాబాయి చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముత్తినేని శ్రీనివాస్, కృష్ణ, వీరస్వామి, నర్సింగం పాల్గొన్నారు.

వరంగల్ ఎంపీగా అవకాశం కల్పించండి

హన్మకొండ: వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం కల్పించాలని బీఆర్ఎస్ నాయకుడు, ఉద్యమ నాయకుడు జోరిక రమేష్ కోరారు. ఈమేరకు బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావును హైదరాబాద్‌లో బుధవారం కలిసి వినతిపత్రం అందించారు. కాకతీయ యూనివర్శిటీ విద్యార్థిగా తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నానని, ప్రతీ ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థుల విజయానికి కృషి చేశానని రమేష్ గుర్తుచేశారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ అర్బన్:
9951602875 9553955722
9010299096
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎల్. రాజేష్ వర్మ (SR) : 9885438059 (హన్మకొండ)
కె. సుధాకర్ (ACO) : 9177258410 (హన్మకొండ)
పి.చంద్రశేఖర్ (ACO) : 8074606274 (వరంగల్)
జి. రవియాదవ్ (ACO) : 9032782191 (కాజీపేట)